ప్రభాత jayabheridaily.com
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
28-04-2024
ఆదివారం
మల్కాజిగిరి
సంపుటి : 01 | సంచిక : 250 | పేజీలు : 8 | వెల : 4

జయభేరి దినపత్రిక
జయభేరి చానల్లో
నికార్సైన జర్నలిస్టులుగా
నిలబడాలను
కుంటున్నారా..
ఆసక్తి కలిగిన యువతీ
యువకులకు అవకాశం
అనుభవం ఉన్నవారికి
ప్రాధాన్యత
jayabherinews@gmail.com
jayabheridaily.com
+91 9391 544 889



# రిజర్వేషన్ల చుట్టూ రాజకీయాలు

తెలంగాణలో రిజర్వేషన్ రాజకీయాలు ఊపందుకుంటున్నాయి. జాతీయ పార్టీలు అయిన కాంగ్రెస్, బీజేపీ ఎన్నికల ప్రచార అంశాలుగా రిజర్వేషన్ల అంశాన్ని తీసుకుంటున్నాయి. బీజేపీ అగ్రనేత అమిత్ షా తెలంగాణలో బహిరంగసభలో ప్రసంగించి ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని ప్రకటించారు. వాటిని ఎస్సీ, ఎస్టీలకు ఇస్తామన్నారు. అదే సమయంలో సీఎం రేవంత్ రెడ్డి మరో చోట ఇదే రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావించారు. కేంద్రంలో మరోసారి బీజేపీ వస్తే రిజర్వేషన్లను పూర్తిగా ఎత్తివేస్తుందని హెచ్చరించారు. ఇలా జాతీయ పార్టీలు రెండు రిజర్వేషన్ల చుట్టూ ఓటింగ్ ప్రయారిటీ సెట్ చేసే ప్రయత్నం చేయడం రాజకీయవర్గాల్లో ఆసక్తికరంగా మారింది. ముస్లిం రిజర్వేషన్ల రద్దు. అమిత్ షా ఎప్పుడు తెలంగాణ పర్యటనకు వచ్చినా.. ఎన్నికల ప్రచార సభల్లో మాట్లాడినా ముస్లిం రిజర్వేషన్ల గురించి ఖచ్చితంగా ప్రస్తావిస్తారు. ముస్లింలకు ఇప్పుడు నాలుగు శాతం రిజర్వేషన్లు ఉన్నాయి. చెప్పడానికి ముస్లిం రిజర్వేషన్లు అంటున్నారు కానీ.. అవి ముస్లింలలో ఆర్థికంగా బాగా వెనుకబడిన 14 ఉపకులాలకు చెందినవారికి ఉన్నాయి. వైఎస్ హయాంలో ముస్లింలను ఆకట్టుకోవడానికి వీటిని ఇచ్చి కులాల జాబితాలో ఆయా వర్గాలను చేర్చారు. మతపరమైన రిజర్వేషన్లు రాజ్యాంగం ప్రకారం చెల్లవు. వీరికి ఉన్న రిజర్వేషన్లను పన్నెండు శాతానికి పెంచుతామని ఉద్యమ సమయంలో కేసీఆర్ హామీ ఇచ్చారు. తర్వాత అసెంబ్లీలో తీర్మానం చేశారు. ఆ తీర్మానం తర్వాత కేసీఆర్ కూడా పట్టించుకోలేదు.

...మిగతాది 2 లో

## అంకుల్ మాటలు పట్టించుకోకండి..
# విని నవ్వుకోండి

### ప్రధాని మోదీపై ప్రియాంక గాంధీ వ్యంగ్యాస్త్రాలు



**జయభేరి, న్యూ ఢిల్లీ :**

ప్రధాని మోదీ కాంగ్రెస్ పై, కాంగ్రెస్ నాయకులపై చేస్తున్న విమర్శలను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వ్యంగోక్తులతో తిప్పికొట్టారు. మోదీని అంకుల్ అని సంబోధిస్తూ, 'ఆ అంకుల్ మాటలు పట్టించుకోకండి' అంటూ ఓటర్లకు సూచించారు. పెళ్లిళ్లలో అర్థంపర్థం లేకుండా మాట్లాడే అంకుల్ లా మోదీ తయారయ్యారన్నారు.

లోక్ సభ ఎన్నికల ప్రచారం లో ఇటీవల కాంగ్రెస్ పై, కాంగ్రెస్ నాయకులపై విమర్శల దాడిని ప్రధాని మోదీ మరింత తీవ్రం చేశారు. ఇన్నాళ్లు వారసత్వ రాజకీయాలు, అవినీతి తదితర అంశాలు కేంద్రంగా విమర్శలు చేసే మోదీ.. తాజాగా కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సామాన్యుల ఆస్తిపాస్తులను లాక్కుంటుందని ఓటర్లను హెచ్చరించడం ప్రారంభించారు. వారసత్వ పన్ను ను కాంగ్రెస్ తీసుకువస్తుందని హెచ్చరిస్తున్నారు. సంపద పునఃపంపిణీపై విమర్శలు చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీని.. పెళ్లిళ్లు, ఫంక్షన్స్ లో ఒక మూలన కూర్చుని అర్థంపర్థం లేని మాటలు మాట్లాడే అంకుల్ తో పోల్చారు కాంగ్రెస్ సీనియర్

...మిగతాది 2 లో



## సీపీఎం నేతలతో సీఎం రేవంత్ భేటీ

**జయభేరి, హైదరాబాద్:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం సిపిఎం నేతలతో భేటీ అయ్యారు.తరువాత అయన మట్లాడుతూ సీపీఎం నాయకులతో చర్చించాం. భువనగిరి పార్లమెంట్ తో పాటు ఇతర స్థానాల్లోనూ సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరాం. మరి కొన్ని రాజకీయ ప్రతిపాదనలు కూడా వారి ముందు పెట్టాం. బీజేపీ శక్తులను ఓడించేందుకు కాంగ్రెస్ కు మద్దతు ఇచ్చేందుకు వారు అంగీకరించారు. దేశంలోనూ ఇండియా కూటమితో కలిసి పనిచేయనున్నారు. ఒకట్రెండు విషయాల్లో సందిగ్ధత ఉన్నా... అధిష్టానంతో చర్చించి రేపటిలోగా ఏకాభిప్రాయానికి వస్తాం. సీపీఎం సహకారంతో భవిష్యత్ లో ముందు కెళతాం.ఈ కలయిక రాష్ట్రంలో కాంగ్రెస్ గెలుపునకు పనిచేస్తుందని భావిస్తున్నాని అన్నారు.



## భూముల అమ్మకాలతోనే
# రుణమాఫీ



**జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 27:**

మల్కాజ్గిరి ఎంపీ స్థానానికి నామినేషన్ వేసిన బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ప్రచారంలో దూసుకుపోతున్నారు. మల్కాజ్గిరి గడ్డపై ఎగిరేది కాషాయ జెండానే అన్నారు ఈటల. మేడ్చల్ అసెంబ్లీ నియోజికవర్గం దమ్మాయిగూడ మున్సిపాలిటీలో రోడ్ షో నిర్వహించిన ఈటల రాజేందర్ కీలక వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్లో భూములు అమ్మకుండా రుణమాఫీ చేస్తే రాజకీయాల నుండి తప్పుకుంటా అంటూ రేవంత్ ప్రభుత్వానికి ఛాలెంజ్ చేశారు ఈటెల రాజేందర్. మోదీ ఏంది గీడీ ఏంది అన్న కేసీఆర్ పరిస్థితి ఏంటో చూస్తున్నాం. ఈరోజు రేవంత్ రెడ్డి కూడా అలాగే మాట్లాడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి అనేక హామీలు ఇచ్చారు. వాటిలో ఒక్క ఆర్టీసీ ఫ్రీ బస్ తప్ప ఇంకే పథకం అమలుకావడం లేదన్నారు. ఒక్క హామీ అమలు చేయకుండా మళ్లీ ఒచ్చి ఓట్లు అడుగుతున్నారు. 17 సీట్లు గెలిపించండి హామీలు అమలు చేస్తా అంటున్నారు. వారు గెలిచేది లేదు మాట నిలబెట్టుకునేది లేదున్నారు ఈటల.అంతకు ముందు కూకట్పల్లి కోర్టులో అడ్వకేట్లను కలిసి వచ్చే ఎన్నికలలో కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని ఈటెల రాజేందర్ కోరారు. బార్ కౌన్సిల్ సభ్యులను, న్యాయవాదులను కలిసి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం సాధించిన పురోగతులను వివరించారు. ఈ సందర్భంగా ఈటెల మాట్లాడుతూ కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు ఏ విధంగా అయితే డబ్బు, మద్యం నమ్ముకున్నాడో, అదే విధంగా నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ డబ్బును మద్యాన్ని నమ్ముకున్నట్లు కనపడుతుందని ఆరోపించారు. నాలుగు నెలల క్రితం రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలకు నేడు చేస్తున్న చేతలకు సంబంధం లేకుండా పోయిందన్నారు. అతి తక్కువ కాలంలోనే ప్రజల విశ్వాసాన్ని కోల్పోతున్న ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి నిలుస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి వేసే ఓటు వాల్యూ జీరో అని, కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసిన వారు దేశంలో చేసేదేమీ లేదని అందుకే అబ్ కీ బార్ చార్ సౌ పార్ అనే నినాదంతో ప్రజలే మోదీని, తనని గెలిపిస్తారని ఈటెల రాజేందర్ ఆశాభావం వ్యక్తం చేశారు.ఇక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో న్యాయవాదులు ముందు వరుసలో ఉండి పోరాడారని, ఆనాడు ఈటెల రాజేందర్ సైతం పోరాటంలో ముందు వరుసలో ఉన్నాడని పలువురు న్యాయవాదులు గుర్తు చేశారు. అదే విధంగా బీజేపీ నినాదం అయిన అబ్ కి బార్ చార్ సౌ పార్, ఫర్ ఎక్ బార్ మోదీ సర్కార్ అనే నినాదానికి తాము సైతం మద్దతు తెలుపుతున్నామని తెలంగాణ బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ సునీల్ గౌడ్ తెలిపారు.



# మాస్ మాధవి

**జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 27:**

తెలంగాణలో అన్ని లోక్సభ నియోజకవర్గాల కంటే ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది మాత్రం హైదరాబాద్ లోక్సభ నియోజకవర్గమే. ఎందుకంటే ఇందుకు ప్రత్యేక కారణాలున్నాయి. ఒకరు ముస్లింపార్టీకి చెందిన ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ పోటీ చేస్తుండగా, ఆయనపై రూపంలోనూ, భాష్యంలోనూ హిందుత్వాన్ని కనపరుస్తున్న కొంపెల్ల మాధవీలత బీజేపీ నుంచి బరిలోకి దిగుతుంది. కొంపెల్ల మాధవీలత ఎంపికే అనూహ్యంగా జరిగింది. ఎందుకంటే ఆమె బీజేపీలో ఉన్నట్లు ఎప్పుడూ కనిపించలేదు. పార్టీ కార్యక్రమాలలో కూడా ఆమె ఎక్కడా కనపడలేదు. అసలు పార్టీ సభ్యత్వం ఉందో కూడా తెలీని పరిస్థితుల్లో కొంపెల్ల మాధవీలతను బీజేపీ తమ పార్టీ అభ్యర్థిగా ఎంపిక చేసింది.కొంపెల్ల మాధవీలత ఎంపిక ఆషామాషీగా జరగలేదు. ఆమె హైదరాబాద్ లో పేరెన్నికగన్న విరంచి ఆసుపత్రి అధినేత సతీమణి. డబ్బుకు కొదవలేదు. మంచి మాటకారి. మొన్నటి వరకూ కొంపెల్ల మాధవీలత అంటే ఎవరికీ తెలియదు. కానీ కొన్ని నెలల నుంచి సోషల్ మీడియాలో ఆమె వీడియోలు వైరల్ అవుతున్నాయి. హిందుత్వ గురించి ఆమె చెప్పే విధానం అందరినీ ఆకట్టుకుంటుంది. పక్కా హిందుత్వ వాదిగా ఆమె స్క్రీన్ పై కనపడుతుండటం కూడా కొంత కలసి వచ్చిందనే అంటున్నారు. అందుకే మరో విషయాన్ని ఆలోచించకుండా బీజేపీ కేంద్ర నాయకత్వం కొంపెల్ల మాధవీలతను హైదరాబాద్ బీజేపీ అభ్యర్థిగా ఎంపిక చేసిందన్న కామెంట్స్ కూడా పార్టీలోనే వినపడుతున్నాయి నిజానికి అసదుద్దీన్ ఒవైసీని పాతబస్తీలో ఎదుర్కొనడం అంత ఆషామాషీ కాదు. 1984 నుంచి 2004 మధ్య ఎంఐఎం అధినేత సుల్తాన్ సలావుద్దీన్ ఒవైసీ ఆరు సార్లు ఎంపీగా అక్కడ గెలిచారు. ఆ తర్వాత 2004 నుంచి నాలుగు ఎన్నికల్లో అసదుద్దీన్ ఒవైసీ ఇక్కడ జెండా పాతేశారు. పాతబస్తీలో గెలుపు అంటే అంత సులువు కాదు. ఇప్పటికే పాతబస్తీలో అనేక దొంగ ఓట్లను తొలగించడంలో కొంత వరకూ సక్సెస్ అయ్యారని బీజేపీ వర్గాలు ఒకింత సంతోషంగా ఉన్నాయి. దొంగ ఓట్ల తోనే ఎప్పుడూ గెలుస్తారని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. కానీ అసద్ భాయ్ ను ఓడించడం

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## రిజర్వేషన్ల చుట్టూ రాజకీయాలు

మునుగోడు ఉపఎన్నికలకుముందు ఎస్సీ రిజర్వేషన్లపై అధికారం లేకపోయినా జీవవో ఇచ్చారు కానీ.. ముస్లిం రిజర్వేషన్లకు ఇవ్వలేదు. గత అసెంబ్లీ ఎన్నికలకు మందు కర్ణాటకలో ఇలా ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తూ అప్పటి బీజేపీ ప్రభుత్వం జీవో ఇచ్చింది. కానీ సుప్రీంకోర్టులో అగిపోయింది. కర్ణాటకలో ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు ఉన్నాయి.వాటిని రద్దుచేసి నాలుగు శాతాన్ని లింగాయత్, ఒక్కలిగలకు చెరో రెండు శాతాన్ని పంచుతున్నట్లు ప్రభుత్వం జీవో ఇచ్చింది. మతం ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వడం రాజ్యాంగ వ్యతిరేకమని, అందుకే ఈ రిజర్వేషన్లను రద్దు చేస్తున్నామని అప్పటి బీజేపీ ప్రభుత్వం వెల్లడించింది. నిజానికి కర్ణాటకలోనూ మతం ఆధారంగా రిజర్వేషన్లు కల్పించలేదు. 1994లో మండల్ కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా ముస్లింలలోని కొన్ని కులాలను ఇతర వెనుకబడిన కులాలను ఓబీసీల్లో సబ్ కేటగిరీగా చేర్చారు. ఆ కేటగరిలోనే రిజర్వేషన్లు ఇస్తున్నారు. అంటే తెలంగాణ తరహాలోనే అక్కడ కూడా కులం ఆధారంగానే ముస్లింలకు రిజర్వేషన్లు అమలవుతున్నాయి. అందుకే ఈ అంశం సుప్రీంకోర్టులో ఆగిపోయింది. కర్ణాటకలో లాగే తెలంగాణలోనూ ముస్లిం రిజర్వేషన్లు తీసేసి ఎస్సీ, ఎస్టీలకు ఇస్తామంటున్నారు. అయితే తెలంగాణలో ముస్లింలకు కులం ఆధారంగా రిజర్వేషన్లు ఇస్తున్నారు. కానీ, మతం ఆధారంగా ఈ రిజర్వేషన్లు వర్తింప చేస్తున్నారని అమిత్ షా అంటున్నారు. ముస్లింలు భారతీయ జనతా పార్టీకి ఓటు బ్యాంక్ కాదు. వారు ఓటు వేయరు కాబట్టి.. వారి విషయంలో బీజేపీ ప్రత్యేకమైన వ్యూహంతో ఉంటుంది. ఇప్పుడు వారి రిజర్వేషన్లు తీసేసి ఎస్సీ, ఎస్టీలకు పెంచుతామని హామీ ఇస్తున్నారు. కుల పరమైన రిజర్వేషన్లే చట్ట పరంగా అమలవుతున్నాయి కాబట్టి ముస్లింలకు ప్రత్యేకంగా రద్దు చేయలేరు.. ప్రత్యేకంగా కమిషన్ వేసి.. వారు అంటే ముస్లింలలో కొన్ని కులాల వారు అర్హులు కాదని తేల్చితే అప్పుడు తీసేయగలరు. అది అంత తేలిక కాదు. అందుకే ఇది రాజకీయ నినాదంగానే ఎక్కువ మంది భావిస్తున్నారు. సిద్ధిపేట సభలో అమిత్ షా ముస్లిం రిజర్వేషన్ల రద్దు ప్రకటన చేసిన కాసేపటికే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ లో బీజేపీపై చార్జిషీట్ వేసే కార్యక్రమంలో కీలక వ్యాఖ్యలు చేశారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లను రద్దు చేయాలని బీజేపీ కుట్ర చేస్తోందని, ఇదే మోదీ ఆఖరు అస్త్రమని స్పష్టం చేశారు. ఆర్ఎస్ఎస్ రిజర్వేషన్లను రద్దు చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని ఆ ఎజెండాను అమలు చేసేందుకు రాజ్యాంగ సవరణ జరగాలని ఇందుకోసం మోదీకి మూడింట రెండు వంతుల మెజార్టీ కావాలన్నారు. అందుకే బీజేపీ నాలుగు వందల సీట్ల టార్గెట్ గా పెట్టుకుందన్నారు. బీజేపీ రాజ్యాంగాన్ని రద్దు చేస్తుందని.. రిజర్వేషన్లను కూడా వదిలి పెట్టదని కాంగ్రెస్ చాలా కాలంగా ప్రచారం చేస్తోంది. ఇప్పుడు అమిత్ షా ముస్లిం రిజర్వేషన్ల గురించి మాట్లాడటంతో.. కాంగ్రెస్ మరింత అందిపుచ్చుకుని ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమయింది. ఈ రిజర్వేషన్ల రద్దు పేరుతో ఓటర్లను భయపెట్టి ఎవరు ఎక్కువగా లబ్ధి పొందుతారో చూడాల్సి ఉంది.

## మాస్ మాధవి

అంటే మాటలు కాదు. కానీ కొంపెల్ల మాధవీలత కు తొలి జాబితాలోనే సీటు దక్కడం చర్చనీయాంశంగా మారింది. మాధవీలత పుట్టింది పాతబస్తీలోనైనా ఆమె గెలవగల సత్తా ఉందా? అన్నదే ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. వేషధారణ చూసి ఆమెను తక్కువగా కూడా అంచనా వేయలేం. ఆమె నిజాం కళాశాలలో డిగ్రీ చదివారు. కోటిలోని ఉమెన్స్ కాలేజీలో పొలిటికల్ సైన్స్ లో పీజీ చేశారు. భరత నాట్య కళాకారిణిగా కూడా గుర్తింపు ఉంది. పాత బస్తీలో అనేక సేవా కార్యక్రమాలను గత కొద్ది రోజులుగా నిర్వహిస్తూ వెళుతున్నారు. అదే ఆమెకు కలసి వచ్చిందంటున్నారు. సోషల్ మీడియాలో వ్యూస్ వచ్చాయని ఓట్లు పడతాయా? అంటే ఆ ప్రశ్నకు సమాధానం మాత్రం దొరకదు. కానీ కొంపెల్ల మాధవీలత మాత్రం తాను పోటీలో ఉన్నానని మాత్రం బాహ్య ప్రపంచానికి చెబుతున్నారు. అసద్ ను నిజంగా ఓడించగలిగితే మాధవీ లత రికార్డుకు ఎక్కుతారు. అంతేకాదు దేశంలోనే జెయింట్ కిల్లర్ గా నిలుస్తారనడంలో సందేహం లేదు. కానీ అది సాధ్యం కావడానికి మాత్రం అవకాశాలు చాలా స్వల్పంగా ఉన్నాయంటున్నారు విశ్లేషకులు. మరి కొంపెల్ల మాధవీలత ఏ మేరకు ఓట్లు సాధిస్తారన్నది చూడాల్సి ఉంది.

## విని నవ్వుకోండి

నాయకురాలు ప్రియాంక గాంధీ. ఆ మాటలు పట్టించుకోవద్దని, అలాంటి హాస్యాస్పద మాటలను విని నవ్వుకోవాలని ఓటర్లకు సూచించారు. 'కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మీ నగలు, మంగళసూత్రం దొంగిలించి వేరొకరికి ఇస్తుంది అని మోదీ అంటున్నారు. ఈ అర్థం లేని మాటలు విన్న తరువాత.. ఏం చేయాలి.. కాసేపు నవ్వుకోవాలి'' అని ప్రియాంక వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ''ప్రధాని హోదాలో ఉన్నాను కాబట్టి.. నేను ఏం మాట్లాడినా.. ఎంత అర్థంపర్థం లేకుండా మాట్లాడినా ప్రజలు నమ్మితారని ప్రధాని మోదీ భావిస్తున్నారు'' అని ప్రియాంక గాంధీ విమర్శించారు. ''కాంగ్రెస్ పార్టీ ఎక్స్ రే యంత్రంతో ప్రజల ఇళ్లలోకి ప్రవేశించి సోదాలు చేస్తుందని, ఆ తర్వాత మీ నగలతో పాటు భద్రపరిచిన మంగళసూత్రాన్ని కూడా లాక్కుని ఇతరులకు ఇస్తుందని ప్రధాని ప్రజలను హెచ్చరిస్తున్నారు. అది సాధ్యమేనా? అంత అర్థం లేకుండా ఎవరైనా మాట్లాడుతారా? ఓటమి భయంతోనే ఆయన ఇలా మాట్లాడుతున్నారా?'' అని ప్రియాంక గాంధీ ప్రశ్నించారు. మోదీ పాలనలో నిత్యావసరాల ధరలు పెరగడాన్ని ప్రస్తావిస్తూ.. ''ఆయన ఖరీదైన మనిషి'' అని వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. ప్రియాంక గాంధీ శనివారం గుజరాత్ లో లోక్ సభ ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొన్నారు.

---

## అరుదైన డాక్టరేట్ అందుకున్న కోటేశ్వరి




జయభేరి, ఇల్లందు :

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.. ఇల్లందు మండలం వేములవాడ గ్రామానికి చెందిన కోటేశ్వరి గత కొన్ని సంవత్సరాలుగా వృద్ధులకు అనాదలకు చేస్తున్న సేవలకు అరుదైన గుర్తింపు పొందింది... భర్త నంగయ్య కుటుంబ సభ్యుల సహకారంతో మూలిక వైద్యంతో ఎందరికో వైద్య సేవలు అందించడం ప్రపంచాన్ని గడగడలాడిచ్చిన కరోనా క్లిష్ట సమయంలో నిరుపేదలకు అందించిన సేవలకు గాను చీమల కోటేశ్వరినీ... సోషల్ సర్వీస్, ఆయుర్వేద వైద్యురాలిగా గుర్తించి డాక్టరేట్ యునైటెడ్ నేషన్ ఇంటర్నేషనల్ పీస్ కౌన్సిల్, నైజీరియా, తమిళనాడు లోని ఉటీ లో గేమ్ పార్క్ గ్రాండ్ హోటల్ లో ముఖ్యఅతిథిగా డాక్టర్ గోపికృష్ణన్ ఎం భానుప్రియ సీనియర్ రేడియాలజిస్ట్ కల్పవృక్షం ట్రస్ట్ ఫౌండర్ ఘనంగా సన్మానించి... అరుదైన డాక్టరేట్ ను అందజేశారు.

# దేశమంతా ఒకటే కోడై కూస్తున్నది

## మళ్ళీ నరేంద్ర మోడీ ప్రధాన కావాలని



జయభేరి, ఉప్పల్ :

ఉప్పల్ నియోజకవర్గం, మల్లాపూర్ డివిజన్, నోమా థియేటర్ నుండి గవర్నమెంట్ స్కూల్, మల్లాపూర్ వరకు రోడ్ షో లో పాల్గొన్న ఈటల రాజేందర్. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ... హారతులు పట్టి పూల వర్షం కురిపించి స్వాగతం పలికిన నా ఆడబిడ్డలకు, మా కార్యకర్తలకు, నాయకులకు అందరికీ పేరుపేరునా నమస్కారం. ఈ రాష్ట్రంలో గతంలో 10ఏళ్ళు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నాడు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాడు. రాష్ట్రంలో ఎవరున్నా కానీ దేశంలో మాత్రం మోడీ ఉండాలి అంటున్నారు. వచ్చే నెల 13వ తారీకు నాడు ఈ దేశానికి మళ్లీ ప్రధానమంత్రి కావాలని ఎన్నికలు జరగబోతున్నాయి. ఇప్పుడైతే దేశమంతా ఒకటే కోడై కూస్తున్నది. నరేంద్ర మోడీ వచ్చిన తర్వాత మన జాతి గౌరవం పెరిగింది, మన దేశం అభివృద్ధి చెందింది, దేశంలో శాంతి నెలకొన్నది. మళ్ళీ ఈ దేశం అభివృద్ధి చెందాలంటే, పేదవాడికి ఇల్లు రావాలంటే, చదువుకున్న పిల్లలకు ఉద్యోగాలు రావాలంటే మళ్ళీ నరేంద్ర మోడీ ప్రధాన కావాలని దేశం కోరుకుంటుంది. నా 22 ఏళ్ల చరిత్ర మీకు తెలుసు. 14 ఏళ్లు తెలంగాణ కోసం కొట్లాడాను. ప్రభుత్వం వచ్చింది, మంత్రిగా ఉన్నప్పుడు చదువుకునే పేద పిల్లల కోసం హాస్టల్స్ లో సన్న బియ్యం తీసుకొచ్చా.
కరోనా వస్తే కుటుంబ సభ్యులు కూడా వారి దగ్గరకు వెళ్లకపోతే.. నేను పోయి ఓదార్చే ప్రయత్నం చేశా, వందల మంది చనిపోయారు.. కొన్ని వేల మందిని కాపాడిన దాంట్లో ఆనాడు కరోనా మంత్రిగా పని చేసిన విషయం మీకు తెలుసు. రేపు భారతీయ జనతా పార్టీ, నరేంద్ర మోడీ గారే ప్రధాని మంత్రి అవ్వడం ఖాయం కాబట్టి.... ఒకవేళ ఈ ముఖ్యమంత్రి కేంద్రం ఇచ్చిన ఇల్లు కట్టకపోతే, పేదలకు ఇవ్వకపోతే కేంద్ర ప్రభుత్వమే నేరుగా పేదలకు ఇల్లు ఇచ్చే పథకం అమలు చేస్తానని మీకు హామీ ఇస్తున్నాను. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే రేవంత్ రెడ్డి ప్రభుత్వం మీద కొట్లాడేది మేమే.. పార్లమెంటుకు పోతే మోడీ అండదండలతో ఆశీర్వాదంతో మీ సమస్యలు పరిష్కరించే జిమ్మేధర్ నాది అని చెప్పి మనవి చేస్తున్నాను. నా పార్టీ భారతీయ జనతా పార్టీ, మా నాయకుడు నరేంద్ర మోడీ, మా గుర్తు కమలం పువ్వు గుర్తు, కాబట్టి మీరు గొప్పగా ఓటు వేసి గెలిపించాలని కోరుకుంటున్నాను.

---

# అదిలాబాద్ కాషాయంలో కషాయం

జయభేరి, అదిలాబాద్, ఏప్రిల్ 27:

ఎన్నికలకు ఇంకా మూడు వారాలు కూడా లేని ఈ సమయంలో ఇక్కడి కాషాయ దళంలో అసమ్మతి మళ్లీ భగ్గుమంటోంది. బరిలో ఉన్న కాషాయ అభ్యర్థికి ఏసీలోను చెమటలు పట్టే పరిస్థితిని తెస్తుందంట. కారణం ఈ పార్లమెంట్ పరిధిలో గెలిచిన నలుగురు ఎమ్మెల్యేలు కలిసినట్టుగానే కలిసి నామినేషన్ ర్యాలీలో పాల్గొన్నారు. అయితే జిల్లాకు చెందిన ముఖ్య నేత మాత్రం కినుక వహించి తిరుగుతున్నారట. అభ్యర్థి ప్రకటన నుండి పార్టీకి దూరంగా ఉంటూ, నా దారి నాదే అన్నట్టుగా వ్యవహరిస్తున్న ఎంపీ సోయం బాపురావు వ్యవహార శైలి నేతల్లో గుబులు పుట్టిస్తోంది. నెల రోజులుగా మౌనం దాల్చిన సోయం బాపురావు నా రూటే సపరేట్ అంటూ తనదైన స్టైల్ లో అభ్యర్థికి షాక్ ల షాక్ ఇస్తున్నాడట. గెలిపే లక్ష్యంగా కాషాయ క్యాడర్ గడపగడపకు ప్రచారం చేస్తున్నా, బీజేపీకి ఆదివాసీ గూడాల నుండి ఆ స్థాయి మద్దతు రావడం లేదట. కారణం సోయం బాపురావు నిర్ణయమే అని టాక్ బలంగా రీసౌండ్ ఇస్తోందట. కారణం ఆయన బీజేపీ అభ్యర్థి గోడెం నగేష్ కు కాకుండా మరోసారి ఆదివాసీ నేతకు జైకొట్టడమే అని తెలుస్తోంది. ఎంపీగా మరోసారి సీట్ దక్కకపోవడంతో అలక బూనిన సోయం బాపురావు, నెల రోజులుగా పార్టీకి కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. తాజాగా బీజేపీ అభ్యర్థికి మద్దతు ఉపసంహరించుకోవడం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. అక్కడితో ఆగకుండా ఆదివాసీ గూడాల్లో ఆదివాసీ పెద్దలతో రహస్యంగా సమావేశమై, తాను బీజేపీలోనే ఉన్నానని, కానీ ఆదివాసీల పక్షాన నిలిచే నేతకే ఈసారి పట్టం కట్టాలని, పార్టీలు ముఖ్యం కాదు నేతలే ముఖ్యం అంటూ తనదైన శైలిలో ఒంటరి ప్రచారం చేస్తున్నారట.అయితే ఆ ప్రచారం బీజేపీ అభ్యర్థికి మద్దతుగా చేస్తున్నది కాకపోవడంతో సోయం ఎవరి పక్షాన నిలిచి ఒంటరి ప్రచారం చేస్తున్నారనే చర్చ పార్లమెంట్ పరిధిలో జోరుగా సాగుతోంది. ఆదివాసీ ఉద్యమ నేతకే పట్టం కట్టాలని సోయం బాపురావు గూడాల్లో గడపగడపకు తన సమాచారం చేరవేస్తుండటంతో.. ఆ ఉద్యమ నేత ఎవరనే టాక్ ఇటు బీజేపీ పార్టీలో అటు రాజకీయవర్గాల్లో జోరుగా సాగుతోంది. అయితే ఆ ఆదివాసీ ఉద్యమ నేత తన చిరకాల మిత్రుడే అన్న టాక్ పార్టీలో రీ సౌండ్ ఇస్తుండటంతో సోయంను దారికి తెచ్చుకునేందుకు అధిష్టానం, పార్లమెంట్ ఇంఛార్జ్ విశ్వప్రయత్నాలే చేస్తున్నారట. బీజేపీ అభ్యర్థి గోడెం నగేష్ నామినేషన్ ర్యాలీకి రావాలంటూ పార్లమెంట్ ఇంఛార్జ్ కాకపట్టినా.. అదిష్టానం నుండి ఫోన్ వచ్చినా, నో వే అంటూ తన



నిర్ణయాన్ని ప్రకటించారట. దీంతో ఎంపీ సోయం ఏం చేస్తాడో అంటూ ఆందోళన చెందుతున్నారు క్యాడర్.అయితే ఇదే సమయంలో పార్లమెంట్ పరిధిలో గెలిచిన నలుగురు ఎమ్మెల్యేల మధ్య సోయం వ్యవహారం చర్చకు రావడం.. నామినేషన్ ర్యాలీలో జనసమీకరణ లేక ర్యాలీ చప్పగా సాగడంతో ఆ నలుగురిలో ఓ ఇద్దరు కీలక ఎమ్మెల్యేల మధ్య జనసమీకరణ విషయంలో అసమ్మతి మరోసారి భగ్గుమందట. కలిసుంటే కలదు సుఖం అని అధిష్టానం నెత్తి నోరు కొట్టుకుంటున్నా, ఆదిలాబాద్ పార్లమెంట్లో నేతల మధ్య ఆ సఖ్యత కనిపించక పోవడంతో అసలుకే ఎసరు వచ్చే ప్రమాదం ఉందన్న సంకేతాలు కనిపిస్తున్నాయంటోంది క్యాడర్.ఓ వైపు ప్రత్యర్థి పార్టీలు ఎన్నికల ప్రచారంలో దూసుకెళుతుంటే, అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటి కాషాయ అడ్డాగా మార్చుకున్న ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో విజయకేతనం ఎగరవేయాల్సిన కాషాయ పార్టీ మాత్రం ఇంకా అసమ్మతి రాగమే ఎత్తుకుని సాగుతుండటం విస్మయానికి గురిచేస్తోందట. దీంతో ఇదే అదునుగా బావించిన ప్రతిపక్ష పార్టీలు ప్రచారంలో పదడుగులు ముందుకు దూసుకెళ్లగా.. సిట్టింగ్ సీటును కాపాడుకుని విజయకేతనం ఎగర వేయాల్సిన బీజేపీ మాత్రం అసమ్మతి.. అలకలు.. నాయకుల మధ్య అంతర్గత పోరుతో వెనక్కి సాగుతున్నట్టుగానే కనిపిస్తుంది. చూడాలి మరీ నాదారి నాదే అంటూ సాగుతున్న సోయం తీరు.. ఎమ్మెల్యేల మధ్య కుదరని సఖ్యత.. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిదిలో బీజేపీ గెలుపును ఏ తీరాలకు చేరుస్తుందో..!

# ఓట్ల కోసం లీడర్ల పాట్లు

- జోరందుకున్న ప్రచారాలు..
- జంప్ జిలానీలతో నేతలకు తిప్పలు..
- వినూత్న రీతిలో ఓటర్లను ప్రసన్నం చేసుకుంటున్న నాయకులు..

**జయభేరి, మేడ్చల్ :**

ఓట్ల పండగ వచ్చిందంటే ఓటరు దేవుడవుతాడు. సమస్యల పరిష్కారానికి ఐదేళ్లు ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగే ప్రజల చుట్టూ ఇప్పుడు నేతలు తిరుగుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల వేళా మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థులకు మద్దతుగా మేడ్చల్ నియోజకవర్గంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఓటర్లను ప్రసన్నం చేసుకోడానికి పడరాని పాట్లు పడుతున్నారు. ఎన్నికలు దగ్గర పడుతుండటంతో గ్రామాల నుండి మొదలు కొని మున్సిపాలిటీ ల వరకు ప్రచారాలు జోరందుకున్నాయి. ఓటర్ల జీవన విధానానికి దగ్గరగా వారు చేసే రోజువారీ పనులను నాయకులు పాల్గొంటూ ప్రజలు చేసే పనులలో భాగస్వాములు అవుతున్నారు. ఇందులో భాగంగా బిఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి మహిళ ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఇప్పటికే ప్రతి ఇంటికి బిఆర్ఎస్ కరపత్రాలతో పాటు దీర్ఘసుమంగళి భావ పేరుతో మహిళ సెంటిమెంట్ ను క్యాష్ చేసుకునేలా ఓట్లను పంపిణీ చేశారు. అలానే మేడ్చల్ మున్సిపాలిటీలో బిఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా చేపట్టిన ప్రచారంలో పట్టణంలోని ఓ హోటల్ లో బొండాలు వేస్తూ వినూత్న ప్రచారాన్ని చేస్తూ ఓటర్లతో మమేకం అవ్వడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.మరోచోట మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి మాజీ మంత్రి ఈటల రాజేందర్ కు మద్దతుగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో చేపట్టిన ప్రచారంలో బీజేపీ నాయకులు మంగలి (హెయిర్ సెలూన్) దుకాణంలో కట్టింగ్ చేస్తూ ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు వినూత్న ప్రచారాలు చేపట్టారు. ఎవరు ఎన్ని చేసిన ఓటర్లు ఎవరికి పట్టం కడతారో ఎన్నికల ఫలితాల వరకు వేచిచూడాలి.






**జంప్.. జిలానీలు..**

పార్లమెంట్ ఎన్నికల సమయం దగ్గర పడుతున్న కొద్దీ రాజకీయ పార్టీల్లో గుబులు పుడుతోంది. అందుకే ఓటమి భయాన్ని అధిగమించేందుకు పలు రాజకీయ పార్టీలు వారి రాజకీయ చాణిక్యానికి పదను పెడుతున్నారు. పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ ప్రస్తుతం అధికారం కోల్పోవడంతో మేడ్చల్ నియోజకవర్గంలో మాజీ మంత్రి మల్లారెడ్డి గెలిచిన తన స్వలాభం కోసం ఎప్పుడు ఏ పార్టీ మారతాడో అనే అనుమానంతో ఎమ్మెల్యే మల్లారెడ్డికి దగ్గరగా మెలిగిన నాయకులు ఒక్కొకరిగా బిఆర్ఎస్ పార్టీకి దూరమౌతున్నారు. ఇదే అదునుగా భావిస్తున్న కాంగ్రెస్, బీజేపీ నేతలు బిఆర్ఎస్ పార్టీ నాయకులను టార్గెట్ చేస్తూ అసమ్మతితో ఉన్న నాయకులను ఒక్కొక్కరిని తమ పార్టీలోకి రావాలని ఆహ్వానిస్తున్నారు. ఇప్పటికే మేడ్చల్ నియోజకవర్గంలోని మాజీ సర్పంచ్ లు, ఎంపిటిసిలు, మున్సిపాలిటీ చైర్మన్ లు, కౌన్సిలర్లు బిఆర్ఎస్ ను వదిలి తమకు కలిసి వస్తుందన్న పార్టీలతో కలిసి కండువాలు మార్చేశారు.

**జోరందుకున్న ఎన్నికల ప్రచారాలు**

పార్లమెంట్ ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో అన్ని పార్టీల అభ్యర్థుల ప్రచారాలు జోరుగా సాగుతున్నాయి. ఒకవైపు దగ్గర పడుతున్న సమయం మరోవైపు వేశవితాపం వల్ల బహిరంగ సభలు నిర్వహించాలంటే ప్రధాన పార్టీలు వెనుకడుగు వేస్తున్నాయి. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో సభలు నిర్వహిస్తే ప్రజలను సమికరించడం తలనొప్పిగా మారింది. అందుకే ఉదయం, సాయంత్రం సమయాల్లో వివిధ పార్టీల నాయకులు గ్రూపులుగా ఏర్పడి ఇంటింటి ప్రచారాలు చేస్తూ స్వయంగా ఓటర్లను కలిసే ప్రయత్నాలు చేస్తూ తమ పార్టీ చేసిన అభివృద్ధిని వివరిస్తూ తాము గెలిస్తే ఏమి చేస్తామో ప్రజలకు వివరిస్తూ తమకే ఓటేసి గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు.



## ప్రతి ఒక్కరు పెద్దమ్మ తల్లి అనుగ్రహం పొందాలి

- మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్

**జయభేరి, దేవరకొండ :**

ప్రతి ఒక్కరు పెద్దమ్మ తల్లి అనుగ్రహం పొందాలని బిఆర్ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు,దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.శనివారం దేవరకొండ మండలం శేరిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ తల్లి విగ్రహా ప్రతిష్ట కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆయన తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రమావత్ నర్సింహ, మాజీ ఉప సర్పంచ్ చిన్న శ్రీను, యాదవ చారి, కొండలు, తదితరులు పాల్గొన్నారు.

## గంప నాగేశ్వరరావు ను సన్మానించిన వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్ సభ్యులు



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండలో గంప నాగేశ్వరరావు దేవరకొండకు వచ్చిన సందర్భంగా వాసవి క్లబ్ అధ్యక్షులు బిక్షమయ్య వాసవి వనిత క్లబ్ అధ్యక్షులు తొనుకునూరు విజయ కార్యదర్శి మంచికంటి పద్మ కోశాధికారి కుంచకూరి శిరీష ఐపిసి గోవిందు కొండయ్య శైలజ ఐపీసీ మాధవి ఆలంపల్లి శిరీష ఏచ్చా చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.





## బిజెపి ఎస్సీ మోచ రాష్ట్ర ఉపాధ్యక్షులు

- అంకురి నరసింహ

**జయభేరి, దేవరకొండ :**

భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా అంకూరి నరసింహా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. ఎస్సీ మోర్చా అధ్యక్షులు కొండేటి శ్రీధర్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అంకురి నరసింహ మాట్లాడుతూ.. నాపై నమ్మకం ఉంచి, నా ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. బిజెపి సిద్ధాంతాలను ఆదర్శాలను అంకితమై నీతి, నిజాయితీ, నిబద్ధత,క్రమశిక్షణ,చిత్తశుద్ధితో వ్యవహరిస్తానని, సహచర కార్యకర్తలతో పార్టీ కమిటీలతో, అన్ని కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటానని, రాష్ట్రంలో ఎస్సీలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల గురించి ఉద్యమాలు చేపట్టడం ద్వారా పార్టీని సంస్థాగతంగా పతిష్టపరిచి అన్ని వర్గాలలో మరింత విస్తరించడానికి కృషి చేస్తానని అన్నారు.

## కొండమల్లేపల్లి లో పార్లమెంట్ ఎన్నికల ప్రచారం

- బిజెపి అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి



**జయభేరి, కొండమల్లేపల్లి :**

కొండమల్లేపల్లి చౌరస్తాలో బిజెపి ఎన్నికల సమావేశం నిర్వహించినారు. ప్రచార సమావేశంలో ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి మాట్లాడుతూ నరేంద్ర మోడీకి ఉన్నది ఒకే కుటుంబమని అది 140 కోట్ల భారతీయుల కుటుంభమని నల్గొండ బీజేపి ఎంపీ అభ్యర్థి సైదిరెడ్డి అన్నారు. కాంగ్రెస్ అంటేనే స్కాములు దోచుకోవడం దాచుకోవడమని అన్నారు. మోడీ పాలనలోనే దేశానికి భద్రత ఉంటుందని కమలం పువ్వుకు గుర్తు ఓటేసి తనని గెలిపించి బీజేపిని అధికారంలోకి తీసుకువచ్చి మోడీని మూడోసారి ప్రధానిని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కేతావత్ లాలు నాయక్ నక్క వెంకటేష్ యాదవ్ ఏ టి కృష్ణ వస్కుల సుధాకర్ చిన్న రాములు బొడిగె సాంబశివ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

## సమాజసేవే సంజీవని లక్ష్యం - డా. కృష్ణ

**జయభేరి, దేవరకొండ :**






దేవరకొండ పట్టణంలో అత్యంత ఆధునిక సదుపాయాలతో నిర్మించిన సంజీవని ఆసుపత్రి యాజమాన్యం సేవ నిరథితో గత కొద్ది కాలంగా ఎంతో మంది పేద గర్భిణీ మహిళలకు ఉచితంగా కాన్పులు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే సైదాబాద్ కు చెందిన చినిపిలి మౌనిక ఇద్దరు కవలపిల్లలకు జన్మనిచ్చింది. తల్లి బిడ్డలు క్షేమంగా ఉండడం పట్ల తల్లిదండ్రులు, బంధువులు డా. కృష్ణను అభినందిస్తూ తమ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వైద్యులు డా. కృష్ణ మాట్లాడుతూ.. పేదవాడికి ఆరోగ్యం అందని ద్రాక్షలా మారుతున్న కాలంలో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారికి, తెల్ల రేషన్ కార్డు ఉన్న వారికి ఈ ఆసుపత్రిలో ఉచితంగా కాన్పులు నిర్వహించడం ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతోనే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని అన్నారు. అదేవిధంగా అత్యవసర వైద్యం కోసం దేవరకొండ ప్రాంతం నుండి హైద్రబాదుకు వెళ్ళే పేదలకు పూర్తిగా ఉచితంగా అంబులెన్స్ సర్వీసు అందుబాటులో ఉంటుందని తెలియజేశారు. ఇక నుండి వెలకు వెల రూపాయలు వైద్యం కోసం ఖర్చు చేయవలసిన అవసరం లేకుండా సాధారణ ఖర్చులతో ప్రజలకు నాణ్యమైన వైద్య సదుపాయాలు సంజీవని ఆసుపత్రి కల్పిస్తుందని ప్రజలంతా ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సేవా నిరతితో ప్రారంభించిన ఈ కార్యక్రమానికి తోటి వైద్యులు, యాజమాన్యం, వైద్య సిబ్బంది మద్దతు తెలుపు పేద ప్రజల పట్ల వారు చూపుతున్న ఔదార్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తెలంగాణ రైతులకు అన్యాయం చేశారు

- బీఆర్ఎస్ ప్రభుత్వం లోనే రైతులకు మేలు జరిగింది
- ఈటెల రాజేందర్ గెలవాలని ఆశీర్వదించాను అంతే - ఎమ్మెల్యే మల్లారెడ్డి
- జగన్ గూడలో రైతు సమస్యలపై నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న మల్లారెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి


**జయభేరి, ఏప్రిల్ 27 :**



తెలంగాణ రాష్ట్ర ప్రజల హక్కులను కాలరాసేందుకు బిజెపి , కాంగ్రెస్ లు ఏకమయ్యాయని, ఆ రెండు జాతీయ పార్టీలు కలిసి తెలంగాణ రైతులను మోసం చేశారని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు . శనివారం మూడుచింతలపల్లి మండలం జగన్ గూడ గ్రామంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి పాల్గొన్నారు . అనంతరం ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తెలంగాణ రైతులను కడుపులో పెట్టుకుని చూసుకున్నాడని అన్నారు. రైతుబంధు, రైతు బీమా మరియు సకాలంలో ఎరువులు, 24 గంటల కరెంటు అందించిన ఘనత కేసీఆర్ దేనని అన్నారు. భారతదేశంలో ఎక్కడ లేనటువంటి మూడున్నర లక్షల మెట్రిక్ టన్నుల పంట పండించిన ఘనత కేసీఆర్ దే అని ఆయన అన్నారు. ఇప్పుడు కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రైతులకు ఏం చేసిందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత త్రాగునీరు కరువైందని , రైతులకు సాగునీరు లేదని , కరెంటు , రైతులకు రైతుబంధు కూడా సకాలంలో వేయడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఎన్నికల ముందు రైతులకు రైతుబంధు 15వేల రూపాయలు వేస్తామని కల్లబొల్లి మాటలు చెప్పి ఓట్లు దండుకొని తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ రైతులను మోసం చేశారని మండిపడ్డారు. బిజెపి ప్రభుత్వం కూడా తెలంగాణ రైతులను దగా చేసిందని 10 ఏళ్లలో తెలంగాణ రైతులకు బిజెపి ప్రభుత్వం చేసింది ఏమీ లేదని విమర్శించారు. అందుకే జగన్ గూడ గ్రామ రైతులు పోస్ట్ కార్డులతో నిరసన కార్యక్రమం నిర్వహించారని అన్నారు.కాగా బిజెపి అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుస్తాడని అన్నారు కదా అని ఓ విలేకరి మల్లారెడ్డిని ప్రశ్నించగా . దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మల్లారెడ్డి నేను ఈటల రాజేందర్ కొన్ని రోజులు ఒకే పార్టీలో కలిసి పని చేశామని, ఆ చనువుతోనే గెలవాలి అని చెప్పి ఆశీర్వదించాను అని దీనిలో ఎలాంటి రాజకీయం లేదని వివరణ ఇచ్చారు. అయితే తమ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి ని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్ గిరి పార్లమెంట్ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి , జగన్ గూడ గ్రామ మాజీ సర్పంచ్ చందుపట్ల విష్ణువర్ధన్ రెడ్డి ,మూడు చింతలపల్లి మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మల్లేష్ గౌడ్, మండల నాయకులు మురళి గౌడ్, రైతులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మల్కాజిగిరిలో ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని ఆశీర్వదించండి

- బిఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి సతీమణి రజినీ ప్రచారం



**జయభేరి, మేడ్చల్ :**

ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేది బీఆర్ఎస్ పార్టీయేనని అని మల్కాజిగిరి బిఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి సతీమణి రజినీ అన్నారు. శనివారం పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిదిలోని ఊర్జిత గేటెడ్ కమ్యూనిటీలో బిఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాగిడి రజినీ మాట్లాడుతూ గత మల్కాజిగిరి ఎంపీ, ప్రస్తుత సీఎం రేవంత్రెడ్డి ఇక్కడి ప్రజలకు చేసిందేమీలేదని, ఎంపీగా ఉన్న రేవంత్రెడ్డి మల్కాజిగిరి వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవని ఆమె విమర్శించారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మల్కాజిగిరి పార్లమెంట్ పరిదిలోని నియోజకవర్గ లలో అనేక అభివృద్ధి పనులు చేయడం జరిగిందన్నారు. ప్రజలు ఈ ఎన్నికల్లో బిఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు అమరం జైపాల్ రెడ్డి, వీణ సురేందర్ గౌడ్,అమరం హేమంత్ రెడ్డి, భేరి బాలరాజు, మున్సిపల్ అధ్యక్షుడు సంజీవ్ గౌడ్, నాయకులు జనార్ధన్ రెడ్డి, జిత్ రెడ్డి, అమరం విజయమ్మ, దప్పు మహేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ సంక్షేమ పథకాలు గెలిపిస్తాయ్

- గుండ్లపోచంపల్లిలో ఇంటింటి ప్రచారం చేసిన కౌన్సిలర్ జైపాల్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు



**జయభేరి, మేడ్చల్ :**

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణకు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలను మరవరాదని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ 11వ వార్డు కౌన్సిలర్ అమరం జైపాల్ రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బిఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా శనివారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిదిలోని 6వ వార్డు మైసమ్మగూడ, 12వ వార్డు మణిక్యారెడ్డి కాలనీలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ అమరం జైపాల్ రెడ్డి మాట్లాడుతూ మల్కాజిగిరి పార్లమెంట్ స్థానంలో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మాజీ సీఎం కేసీఆర్ పేద ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు లక్ష్మారెడ్డిని గెలిపిస్తాయని అన్నారు. బిఆర్ఎస్ అభ్యర్థి జలుబు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్లు భేరి బాలరాజు, కో అప్షన్ సభ్యుడు దేవేందర్, నాయకులు జనార్ధన్ రెడ్డి,బండారి శ్రీనివాస్, సత్తిరెడ్డి, కుంచె శ్రీనివాస్ గౌడ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రభాత జయభేరి



# మెరిసే చర్మం కోసం ఫేస్ ప్యాక్స్

వేసవిలో చర్మం అందంగా మెరిసిపోవాలంటే రాత్రి పడుకునే ముందు కొన్ని చిట్కాలు పాటించాలి. అప్పుడే అందంగా కనిపిస్తారు.

వేసవిలో చర్మ సమస్యలు అనేకం వస్తాయి. ఈ సమయంలో చర్మం కాలిపోవడం ప్రారంభమవుతుంది. చర్మవ్యాధి నిపుణుల అభిప్రాయం ప్రకారం, సూర్యుడి నుండి వచ్చే హానికరమైన UV కిరణాలు మన చర్మానికి చాలా హాని కలిగిస్తాయి. మనం మన వయస్సు కంటే పెద్దవారిగా కనిపించడం ప్రారంభిస్తాం. చర్మ సంరక్షణ విషయానికి వస్తే మార్కెట్‌లో లభించే ఉత్పత్తుల వైపు మొగ్గు చూపుతాం. అయితే ఈ సమస్యలకు ఇంటి చిట్కాలే పరిష్కారం. సూర్యరశ్మి, కాలుష్యం మన చర్మానికి పెద్ద శత్రువులు. మీరు ఆఫీసుకు వెళ్లినా లేదా మరేదైనా పని కోసం బయటకు వెళ్లినా.. సూర్యుని హానికరమైన కిరణాల నుండి మీ చర్మాన్ని పూర్తిగా రక్షించుకోలేరు. కానీ మీరు మీ చర్మ సంరక్షణలో కొన్ని ఇంటి చిట్కాలను ఉపయోగించడం ద్వారా ఈ సమస్యలను తగ్గించుకోవచ్చు. చలికాలంలో చర్మ సంరక్షణపై ఎంత శ్రద్ధ వహిస్తామో, వేసవిలో చర్మాన్ని, దాని రక్షణపై కూడా అంతే శ్రద్ధ పెట్టాలి. సాధారణంగా వేసవిలో చర్మం జిడ్డుగా మారుతుంది. వేసవిలో వచ్చే చర్మ సమస్యలకు మార్కెట్‌లో రకరకాల చర్మ సంరక్షణ క్రీములు అందుబాటులో ఉన్నాయి. అయితే ఇది అందరి చర్మానికి సరిపోతుందని చెప్పలేం. కానీ మన ఇంట్లో ఉండే ఈ ఉత్పత్తులు అందరి చర్మానికి సరిపోతాయి. వేసవిలో చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి కింద చెప్పే విషయాలను ఫాలో అవ్వండి. మొటిమలు, బ్లాక్ హెడ్స్, కళ్ల కింద నల్లటి వలయాలు మొదలైన వాటిని తొలగిస్తుంది.

**పెరుగు**
పెరుగు ఆరోగ్యానికి, చర్మానికి ఎంతో మేలు చేస్తుంది. పెరుగులో విటమిన్ డి, క్యాల్షియం, ప్రొటీన్లు ఉంటాయి. ఇది చర్మాన్ని కాంతివంతం చేస్తుంది. నల్ల మచ్చలను తొలగిస్తుంది. వేసవిలో పెరుగును రాత్రిపూట ముఖానికి పట్టించి చేతులతో మసాజ్ చేయాలి. మూడు నుంచి నాలుగు నిమిషాలు మసాజ్ చేస్తే సరిపోతుంది. మసాజ్ చేసిన తర్వాత అలా వదిలేసి ఉదయాన్నే నీళ్లతో ముఖం కడుక్కోవాలి.

**దోసకాయ రసం**
వేసవిలో రాత్రిపూట దోసకాయ రసాన్ని ముఖానికి రాసుకుంటే చర్మం చల్లబడి వేసవిలో వచ్చే చర్మపు చికాకు తగ్గుతుంది. దాని రసాన్ని తీయడానికి దోసకాయను తురుముకోవాలి. దాని నుండి రసం తీయండి. ఈ సారాన్ని రాత్రి పడుకునే ముందు ముఖంపై రాసుకోవాలి. ఇలా చేయడం వల్ల మొటిమలు తొలగిపోవడమే కాకుండా చర్మం మెరుస్తుంది.
దోసకాయలో 92 శాతం నీరు ఉంటుంది. ఇది మీ చర్మాన్ని హైడ్రేట్ చేయగలదు. ఇది వేడి వల్ల కలిగే అనేక చర్మ సమస్యలను నయం చేస్తుంది. ప్రతిరోజూ రాత్రి నిద్రపోయే ముందు, మీ ముఖం కడుక్కోండి. బాగా ఆరబెట్టండి, దోసకాయ రసాన్ని అప్లై చేసి రాత్రంతా అలాగే ఉంచండి. దీంతో మొటిమల సమస్యను శాశ్వతంగా దూరం చేసుకోవచ్చు. మొటిమలతో పాటు, చర్మాన్ని సహజంగా మెరిసేలా చేయడానికి దోసకాయ సహాయపడుతుంది.

**అలోవెరా జెల్**
అలోవెరా జెల్ ముఖానికి రాసుకుంటే వేసవిలో టానింగ్ సమస్య తొలగిపోయి. చర్మం మృదువుగా మారుతుంది. రాత్రిపూట అలోవెరా జెల్‌ని ముఖానికి రాసుకుని మర్దన చేసి ఉదయం ముఖం కడుక్కోవాలి. ఇది మొటిమల సమస్యను దూరం చేసి చర్మాన్ని మెరుగుపరుస్తుంది.

**బాదం నూనె**
బాదం నూనె చర్మానికి చాలా మంచిది. వేసవిలో పడుకునే ముందు బాదం నూనెతో మీ ముఖాన్ని మసాజ్ చేయండి. ఇది లోపలి నుండి చర్మాన్ని రిపేర్ చేస్తుంది. చర్మాన్ని ప్రకాశవంతం చేస్తుంది. బాదం నూనె UV కిరణాల హానికరమైన ప్రభావాల నుండి చర్మాన్ని రక్షిస్తుంది. ముఖం నుండి మచ్చలను తొలగించడంలో సహాయపడుతుంది.

**ఆలివ్ నూనె**
చర్మానికి చాలా మంచిది. అనేక సమస్యలను సులభంగా నయం చేస్తుంది. దీన్ని ఉపయోగించడానికి, కొన్ని చుక్కల ఆలివ్ నూనెను ముఖానికి అప్లై చేసి చేతులతో మసాజ్ చేయండి. ఇలా రోజూ రాత్రిపూట చేస్తే చర్మం మెరిసిపోయి ముడతలు సులువుగా తొలగిపోతాయి.



సొంత ఇలాఖాలో మరో భారీ స్కోరింగ్ మ్యాచ్‌లో మాజీ చాంపియన్ ముంబై ఇండియన్స్‌ను మట్టికరిపించింది. యువ సంచలనం జేక్ ఫ్రేజర్ ధనాధన్ ఇన్నింగ్స్‌కు తోడు ఆఖర్లో స్టబ్స్ సుడిగాలి ఆటతో ఢిల్లీ 257 స్కోరు అందుకుంది. ముంబై బౌలర్లను చెడుగుడు ఆడుకుంటూ ఫ్రేజర్ బౌండరీలతో విరుచుకుపడ్డాడు. 11 ఫోర్లు, ఆరు భారీ సిక్సర్లతో వీరవిహారం చేసిన ఈ హార్డ్‌హిట్టర్ ధాటికి ముంబై విలవిలలాడిపోయింది. భారీ లక్ష్యఛేదనలో సహచరులు విఫలమైనా..తిలక్‌వర్మ ఒంటరిపోరాటంతో జట్టును గెలిపించేందుకు చేసిన ప్రయత్నం నెరవేరలేదు. వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయిన ముంబై విజయానికి 10 పరుగుల దూరంలో బోల్తా కొట్టింది.

**జేక్ ఫ్రేజర్, స్టబ్స్ వీరవిహారం...**

**తిలక్‌వర్మ ఒంటరి పోరు వృథా**

**ఉత్కంఠ పోరులో ముంబై ఓటమి**




# ఢిల్లీ క్యాపిటల్స్ దుమ్మురేపింది!

మరో భారీ స్కోరు అభిమానులను అలరించింది. శనివారం జరిగిన తొలి పోరులో ఢిల్లీ 10 పరుగుల తేడాతో ముంబై ఇండియన్స్‌పై ఉత్కంఠ విజయం సాధించింది. తొలుత జేక్ ఫ్రేజర్(27 బంతుల్లో 84, 11ఫోర్లు, 6సిక్స్‌లు) అర్ధసెంచరీకి తోడు స్టబ్స్(25 బంతుల్లో 48 నాటౌట్, 6ఫోర్లు, 2 సిక్స్‌లు), హోప్(41) రాణించడంతో ఢిల్లీ నిర్ణీత ఓవర్లలో 257/4 భారీ స్కోరు చేసింది. నబీ, చావ్లా, బుమ్రా, వుడ్ ఒక్కో వికెట్ తీశారు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన ముంబై 247/9 స్కోరు చేసింది. తిలక్‌వర్మ(32 బంతుల్లో 63, 4ఫోర్లు, 4 సిక్స్‌లు), హార్దిక్‌పాండ్యా(46) ఆకట్టుకున్నారు. ముఖ్యంగా తిలక్‌వర్మ సూపర్ ఇన్నింగ్స్‌తో కదంతొక్కాడు.ముకేశ్‌కుమార్ (3/59), రసిక్ సలామ్ (3/34) మూడేసి వికెట్లు తీశారు. ఫ్రేజర్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.


**ఫ్రేజర్ ఫటాఫట్:** తొలుత టాస్ గెలిచిన ముంబై కెప్టెన్ హార్దిక్ పాండ్యా..ఢిల్లీని బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. ఇక్కడే పాండ్యా పప్పులో కాలేశాడు. అందివచ్చిన అవకాశాన్ని ఢిల్లీ చక్కగా వినియోగించుకుంది. ఓపెనర్ ఫ్రేజర్ తొలి బంతి నుంచే విధ్వంసానికి తెరతీశాడు. ఫలితంగా 19 పరుగులు వచ్చిపడ్డాయి. రెండో ఓవర్‌కు దిగిన బుమ్రాను కూడా ఫ్రేజర్ గట్టిగానే అరుసుకున్నాడు. నోబాల్‌తో బౌలింగ్ మొదలుపెట్టిన బుమ్రా ఓవర్‌లో 18 పరుగులు పిండుకున్నాడు. ఆ తర్వాత తుషారకు మూడు ఫోర్లతో స్వాగతం పలికాడు. బౌలింగ్ మార్పుగా వచ్చిన చావ్లాను విడిచిపెట్టకుండా బాదడంతో 15 బంతుల్లోనే ఫ్రేజర్ అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు. లాభం లేదనుకుని బౌలింగ్‌కు వచ్చిన కెప్టెన్ పాండ్యాను ఫ్రేజర్ రెండు ఫోర్లు, రెండు సిక్స్‌లు దంచుకున్నాడు. దీంతో పవర్‌ప్లే ముగిసే సరికి ఢిల్లీ వికెట్ కోల్పోకుండా 92 పరుగులు చేసింది. ప్రమాదకరంగా మారుతున్న ఫ్రేజర్‌ను చావ్లా ఔట్ చేయడంతో తొలి వికెట్‌కు 114 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఆ తర్వాత వచ్చిన హోప్..పోరెల్‌కు జతకలిశాడు. హోప్ ఉన్నంతసేపు సిక్స్‌లతో స్టేడియాన్ని ఊపేశాడు. నబీ బౌలింగ్‌లో ఇషాన్ కిషన్ క్యాచ్‌తో పోరెల్ ఔటయ్యాడు. రిషబ్ పంత్(29) ఫర్వాలేదనిపించినా..ఆఖర్లో స్టబ్స్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. వుడ్ వేసిన 18వ ఓవర్లలో స్టబ్స్ ఐదు ఫోర్లు, సిక్స్‌తో 26 పరుగులు కొల్లగొట్టాడు.

**తిలక్ పోరాడినా:** నిర్దేశిత లక్ష్యఛేదనలో ముంబైకి సరైన శుభారంభం దక్కలేదు. రోహిత్‌శర్మ(8), ఇషాన్‌కిషన్(20) నిరాశపరిచారు. ఖలీల్ బౌలింగ్‌లో షాట్ ఆడబోయిన రోహిత్..హోప్ క్యాచ్‌తో తొలి వికెట్‌గా వెనుదిరిగాడు. పది పరుగుల తేడాతో కిషన్ కూడా ఔట్ కావడంతో ముంబై కష్టాల్లో పడింది. ఈ దశలో ఆదుకుంటాడనుకున్న సూర్యకుమార్(26) ఉన్నంతసేపు బ్యాటు ఝులిపించినా..అదే జోరు కొనసాగించలేకపోయాడు. యువ బ్యాటర్ తిలక్‌వర్మ మంచి పరిణితి కనబరిచాడు. సహచరులు ఒక్కొక్కరుగా ఔట్ అవుతున్నా..కెప్టెన్ పాండ్యాతో కలిసి ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. వీరిద్దరు కలిసి ఢిల్లీ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ లక్ష్యాన్ని కరిగించే ప్రయత్నం చేశారు. సలాం బౌలింగ్‌లో ముకేశ్ క్యాచ్‌తో పాండ్యా ఔటయ్యాడు. దీంతో నాలుగో వికెట్‌కు 71 పరుగుల పార్టనర్‌షిప్‌కు బ్రేక్‌పడింది. వదేరా(4) విఫలం కాగా, డేవిడ్(37)తో కలిసి వర్మ..మళ్లీ ఇన్నింగ్స్‌కు ఊపు తీసుకొచ్చాడు. వీరిద్దరి ఆటతో ఒక దశలో ముంబై గెలుస్తుందనిపించింది. కానీ డేవిడ్, నబీ(7) ఔట్ కావడం ముంబై చాన్స్‌ను దెబ్బతీసింది. ఆఖరి ఓవర్లో 25 పరుగులు అవసరమైన దశలో తొలి బంతికే వర్మ రనౌట్ కావడంతో ముంబై ఓటమి ఖరారైంది.

**సంక్షిప్త స్కోర్లు:**
ఢిల్లీ: 20 ఓవర్లలో 257/4 (ఫ్రేజర్ 84, స్టబ్స్ 48*, నబీ 1/20, బుమ్రా 1/35), ముంబై: 20 ఓవర్లలో 247/9 (తిలక్‌వర్మ 63, పాండ్యా 46, రసిక్ 3/34, ముకేశ్ 3/59)

**ఐపీఎల్‌లో రికార్డు స్కోర్లు**
549ఎస్‌ఆర్‌హెచ్ X ఆర్సీబీ
523ఎస్‌ఆర్‌హెచ్ X ముంబై
523కేకేఆర్ X పంజాబ్, 504ఢిల్లీ X ముంబై
2 ఈ సీజన్ ఐపీఎల్‌లో 15 బంతుల్లో అర్ధసెంచరీ మార్క్ అందుకోవడం ఢిల్లీ ఓపెనర్ ఫ్రేజర్‌కు ఇది రెండోసారి

# మహిళలకు ఫిట్ నెస్



40 ఏళ్లు పైబడిన మహిళలు ఫిట్‌నెస్ విషయంలో ఈ తప్పులు చేయొద్దు

చాలా మంది మహిళలు ఫిట్‌గా ఉండాలని రకరకాల వ్యాయామాలు చేస్తారు. అయితే 40 ఏళ్లు పైబడిన తర్వాత ఫిట్‌నెస్ విషయంలో చాలా జాగ్రతలు తీసుకోవాలి.
వయసు అనేది సీరియస్‌గా తీసుకోవాల్సిన విషయం. వయస్సు కూడా తరచుగా ఆరోగ్యాన్ని సంక్షోభంలో పడేస్తుంది. ఎందుకంటే వయసు పెరిగే కొద్దీ మన ఆరోగ్యం విషయంలో చిన్న చిన్న సమస్యలు వస్తాయని సాధారణంగా చెబుతారు. కానీ ఇతర పరిస్థితులు కూడా ఉన్నాయి. ముఖ్యంగా స్త్రీల విషయంలో కొంచెం ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలి. ఎందుకంటే మనం నలభైలలోకి అడుగు పెట్టినప్పుడు మనలో చాలామంది మన మొత్తం శ్రేయస్సు, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యత ఇస్తారు.
కానీ మనం ఫిట్‌నెస్ గురించి ఆలోచించినప్పుడు, అది మన ఆరోగ్యాన్ని ఎలా సవాలు చేస్తుందో చాలా మందికి తెలియదు. అయితే ఆరోగ్యాన్ని పెంచే లక్ష్యంతో మనం చేసే ఫిట్‌నెస్ వ్యాయామాలన్నీ సరైనవి కావని కూడా తెలుసుకోవాలి. ముఖ్యంగా నలభై తర్వాత ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఇది మీ జీవితకాలం వరకు సమస్యలను కలిగిస్తుంది. ఈ వయస్సులో మీరు దూరంగా ఉండవలసిన కొన్ని విషయాలు ఉన్నాయి. అవి ఏంటో చూద్దాం..

**విశ్రాంతిని నిర్లక్ష్యం చేయొద్దు**
ఆరోగ్యాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో చాలా మంది వ్యాయామానికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా విశ్రాంతిని నిర్లక్ష్యం చేస్తారు. కానీ ఇది ఎప్పుడూ సరైన చర్య కాదని గమనించడం ముఖ్యం. ఎందుకంటే ఇలా చేయడం వల్ల మన ఆరోగ్యం దెబ్బతింటుంది. ఇది తరచుగా దీర్ఘకాలిక అలసట, బలహీనమైన రోగనిరోధక శక్తిని కలిగిస్తుంది. వీలైనంత వరకు ఇలాంటి వాటికి దూరంగా ఉండాలి.


**ఈ విషయం పాటించండి**
తరచుగా 40 ఏళ్ల వయస్సులో స్త్రీలలో బలం తగ్గుతుంది. ఫలితంగా చాలా మంది కార్డియో వ్యాయామాలకు మారతారు. అయితే అటువంటి పరిస్థితిలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఎందుకంటే కండరాల బలాన్ని పెంచడానికి వ్యాయామం చేయడానికి మనం శ్రద్ధ వహించాలి. లేదంటే మీ ఎముకలు అనారోగ్యానికి గురిచేస్తాయి. దీంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటారు.

**యోగా, ధ్యానం**
ఫిట్‌గా ఉండటానికి ప్రయత్నిస్తున్నప్పుడు మనం తెలుసుకోవలసినది ఏమిటంటే, వయస్సు పెరిగే కొద్దీ శరీరం ఫ్లెక్సిబిలిటీని కోల్పోతుంది. దాన్ని సరిచేయడానికి, శరీరాన్ని ఫ్లెక్సిబుల్‌గా ఉంచడానికి చేయవలసినవి ఉన్నాయి. యోగా, ధ్యానం వంటివి దీనికి సహాయపడతాయి. ముఖ్యంగా నలభై తర్వాత బాడీ ఫ్లెక్సిబిలిటీ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

**వార్మప్ చేయాలి**
వార్మప్ దాటవేయడం తరచుగా మీ అసౌకర్యాన్ని మరింత తీవ్రతరం చేస్తుంది. వీలైనంత వరకు శరీరం వేడెక్కేలా చూసుకోండి. అలా కాకుండా నేరుగా వ్యాయామం చేయడం వల్ల మీ ఆరోగ్యం దెబ్బతింటుంది. ఇది కండరాలపై ఒత్తిడిని పెంచుతుంది. అందువల్ల మీరు ఈ విషయాలపై శ్రద్ధ వహించాలి. ముఖ్యంగా మహిళలు నలభై తర్వాత వ్యాయామం చేసే మహిళలు గుర్తుంచుకోవాలి.

**కఠినమైన వ్యాయామాలు**
కఠినమైన వ్యాయామాలు కూడా జాగ్రత్తగా చేయాలి. ఎందుకంటే ఇది మీ ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. తరచుగా దూకడం, పరిగెత్తడం మొదలైనవన్నీ బెణుకు, గాయాలు వంటి సమస్యలకు దారితీస్తాయి. ఇది శరీరంపై అనవసరమైన ఒత్తిడికి కూడా దారితీస్తుంది. సరైన శిక్షణ లేకుండా వీటిలో దేనినీ చేయడానికి ప్రయత్నించవద్దు.

**రెగ్యులర్ వ్యాయామం**
రెగ్యులర్ వ్యాయామం చేసేవారు తరచుగా పోషకాహారం గురించి మరచిపోతారు. ఇది తీవ్రమైన ఆరోగ్య సమస్యలను కలిగించే స్థాయికి విషయాలను తీసుకువస్తుంది. ఈ విషయాలను జాగ్రత్తగా నిర్వహించకపోతే సమస్యలను కలిగిస్తుంది. క్రాష్ డైట్‌లు, ప్రాసెస్ చేసిన ఆహారాలు, శుద్ధి చేసిన చక్కెరలు, సంతృప్త కొవ్వుల అధిక వినియోగం పూర్తిగా నివారించాలి. ఆరోగ్యకరమైన ప్రోటీన్లు, విటమిన్లు తీసుకోవడంపై దృష్టి పెట్టండి. శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచుకోండి.






## బరువు తగ్గడమే లక్ష్యం

సెలెబ్రిటీలకు అందం ముఖ్యం. అందం ఉన్నంత కాలమే అవకాశాలు క్యూ కడతాయి. వయసుతోపాటు పెండ్లి, పిల్లలు.. అందాన్ని ప్రభావితం చేస్తాయి. అందరిలాగే తనకూ అవి అవరోధాలుగా నిలిచాయని చెబుతున్నది బాలీవుడ్ నటి సోనమ్ కపూర్. స్టార్ డాటర్‌గా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టినప్పటికీ సినిమాలు, పెండ్లి విషయంలో అనేక ట్రోల్స్‌కు గురైంది సోనమ్. 'తల్లి అయ్యాక నా శరీరంలో వచ్చిన మార్పులు, అధిక బరువు కారణంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నా. నాతో నేను గడిపే సమయం తగ్గిపోయింది. శారీరం గురించి ఆలోచించే తీరికే లేకుండా పోయింది. కానీ, అమ్మతనం కన్నా అందమేముంది చెప్పండి? అయితే బాబు పుట్టిన తర్వాత ఏకంగా 32 కిలోల బరువు పెరిగాను. దాన్ని గుర్తించడానికి నాకు ఏడాదిన్నర పట్టింది. పెరిగిన బరువు తగ్గించుకోవాలని సంకల్పించాను. కష్టతరమైన వ్యాయామాలు చేస్తున్నా. ఆహారపు అలవాట్లు మార్చుకున్నా. త్వరలోనే మునుపటి సోనమ్‌ను చూస్తార'ని చెబుతున్నది ఈ బ్యూటీ.



# రిలీజ్ డేట్ వచ్చేసింది..

## ప్రభాస్ అభిమానుల ఎదురుచూపులకు తెరదించిన మేకర్స్..!

యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న చిత్రం కల్కి 2898 ఏడీ. 'మహానటి ఫేమ్ నాగ్ అశ్విన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నాడు. హీరోయిన్లుగా బాలీవుడ్ ముద్దుగుమ్మలు దీపికా పదుకొణె, దిశా పటాని నటిస్తున్నారు. విశ్వ నటుడు కమల్ హాసన్‌తో పాటు బిగ్‌బీ అమితాబ్ బచ్చన్ ఈ చిత్రంలో నటిస్తున్నారు. హాలీవుడ్ స్థాయిలో వస్తున్న ఈ మూవీ ఎప్పుడెప్పుడా అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. గతకొద్ది రోజులుగా అభిమానులు మూవీ రిలీజ్‌కు సంబంధించిన అప్‌డేట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా అభిమానుల ఎదురుచూపులకు తెరదించుతూ చిత్రం రిలీజ్ డేట్‌ను మేకర్స్ ప్రకటించారు. జూన్ 27న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్ వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రభాస్, దీపికా అమితాబ్‌లపై ఓ క్రేజీ పోస్టర్‌ను సైతం రిలీజ్ చేశారు. భారీ బడ్జెట్‌తో వస్తున్న ఈ చిత్రానికి సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తుండగా.. వైజయంతి మూవీ నిర్మిస్తున్నది. పురాణాల్లోని కల్కి అవతారాన్ని స్ఫూర్తిగా తీసుకొని డైరెక్టర్ నాగ్ అశ్విన్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తున్నది. దాదాపు రూ.600కోట్ల బడ్జెట్‌తో సినిమాను వైజయంతి మూవీస్ నిర్మిస్తున్నారు. భారతీయ సినిమా చరిత్రలోనే భారీ బడ్జెట్ సినిమాల్లో కల్కి తెరకెక్కుతున్నది.

తెలుగుతో పాటు హిందీ భాషల్లో ఏకకాలంలో ఈ మూవీని షూటింగ్‌ను పూర్తి చేశారు. తమిళ్, మలయాళం, కన్నడంతో పాటు ఇంగ్లీష్‌లో డబ్ చేసి విడుదల చేయనున్నారు. సలార్ తర్వాత ప్రభాస్ నటిస్తున్న చిత్రం కావడంతో ఈ మూవీపై భారీగానే అంచనాలున్నాయి. ఈ సినిమా రిలీజ్‌తో ఇండియన్ సినిమా రికార్డులన్నీ కల్కి అధిగమించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ చిత్రంలో ప్రభాస్ భైరవ అనే పాత్రలో నటిస్తుండగా.. అశ్వత్థామగా అమితాబ్, కాళీగా కమల్‌హాసన్ నటిస్తున్నారు. కెరీయర్‌లోనే తొలిసారిగా కమల్ హాసన్ విలన్‌గా నటిస్తుండడం అభిమానుల్లో మరింత ఆసక్తిని రేకెత్తిస్తున్నది.




# నేను సిద్ధిలాగే ఉంటాను..

'ఇందులో నా పాత్ర పేరు సిద్ధి. స్వేచ్ఛగా బతకాలని కోరుకునే అమ్మాయిని. హీరో కేరక్టర్‌కి పూర్తి భిన్నంగా ఉండే పాత్ర. ఈ రెండు పాత్రలు కలిస్తే ఎలా ఉంటుందనేది ఇందులో గమ్మత్తైన అంశం. ఈ పెళ్లి చుట్టూ తిరిగే కథ.. అందరికీ నచ్చేలా ఉంటుంది.' అని ఫరియా అబ్దుల్లా అన్నారు. అల్లరి నరేశ్‌తో ఆమె జతకట్టిన సినిమా 'ఆ ఒక్కటీ అడక్కు'. మల్లి అంకం దర్శకుడు. రాజీవ్ చిలక నిర్మాత. మే 3న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఫరియా అబ్దుల్లా మీడియాతో ముచ్చటించింది. 'సిద్ధి కూడా నాలాంటి అమ్మాయే. బయట నేను సిద్ధిలాగే ఉంటాను. అందుకే చేయడానికి పెద్ద కష్టపడలేదు. ఇందులో కామెడీ చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. పరిస్థితుల నుంచే హాస్యం పుడుతుంది. ఇందులోని కంటెంట్ ప్రేక్షకులని సహజంగానే నవ్విస్తుంది.' అని చెప్పారు ఫరియా అబ్దుల్లా. అల్లరి నరేశ్‌తో పనిచేయడం అద్భుతమైన అనుభవం అనీ, తన కామెడీ టైమింగ్ ఎక్స్‌ట్రార్డినరీగా ఉంటుందని, ఈ సినిమాలో ఆయన కడుపుబ్బ నవ్విస్తారని ఫరియా నమ్మకంగా చెప్పారు. 'దర్శకుడు మల్లీ తనకు బౌండ్ స్క్రిప్ట్ ఇచ్చారు. కథ గురించి అందరితో చర్చిస్తారు. అందరి సలహాలు తీసుకుంటారు. ఎప్పుడూ నవ్వుతూనే ఉంటారు. ఆయన వర్కింగ్ స్టైల్ నాకు నచ్చింది' అని తెలిపారు ఫరియా. 'ఒకప్పటికీ ఇప్పటికీ పెళ్లి విషయంలో చాలా మార్పులొచ్చాయి. జీవిత భాగస్వామిని ఎంచుకునే విషయంలో అందరూ కచ్చితంగా ఉంటున్నారు. మ్యాట్రీమోనీ సైట్‌స్‌ను ఆశ్రయిస్తూ, ఒకరి గురించి ఒకరికి తెలియకుండానే ఒకటైపోతున్నారు. ఇలాంటి అంశాలతోపాటు పెళ్లికి సంబంధించిన అనేక అంశాలు కూడా ఇందులో ఉంటాయి.' అని ఫరియా తెలిపారు. ఎక్కడా రాజీ పడకుండా పేషన్‌తో నిర్మాత రాజీవ్ చిలక ఈ చిత్రాన్ని నిర్మించారని, అలాంటి మంచి నిర్మాత ప్రాజెక్ట్‌లో భాగం కావడం ఆనందంగా ఉందని ఫరియా అన్నారు. 'మత్తు వదలరా 2', గోపీ దర్శకత్వంలో 'భగవంతుడు' సినిమాలతోపాటు ఓ తమిళ సినిమా కూడా చేస్తున్నట్టు ఫరియా తెలిపారు.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com